మరాఠీలకు మహా సంస్థానం..!



శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో స్వామివారు

- మహారాష్ట్ర భక్తులకు ఇలవేల్పుగా శ్రీపాద శ్రీవల్లభస్వామి
- పిఠాపురంలో స్వామివారి ఆలయానికి భక్తుల తాకిడి
- ఏటా రూ.కోట్లలో ఆదాయం
- రవాణా, హోటల్స్, వసతి రంగాలకు భారీగా వ్యాపారం

పిఠాపురం: శివాజీ పుట్టిన మహారాష్ట్ర ఆధాత్మికంగా, పర్యాటకంగా దేశంలోనే ఎంతో ప్రసిద్ధి. దేశం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు, పర్యాటకులు అక్కడకు వెళతారు. కాగా మహారాష్ట్ర భక్తులు మాత్రం తమ ఇలవేల్పుగా భావించే పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభస్వామి దర్శనానికి పోటెత్తుతుంటారు. ఒక్క మహారాష్ట్ర నుంచే ఏటా పిఠాపురం శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానానికి లక్షల్లో భక్తులు తరలివస్తారు. దత్తాత్రేయుని జన్మస్థలంగా పేరొందిన పిఠాపురం శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానానికి తెలుగు రాష్ట్రాల భక్తుల కంటే ఎక్కువ సంఖ్యలో మరాఠీ భక్తులే రావడం విశేషం. దత్తాత్రేయుని ప్రథమ అవతారమైన శ్రీపాద శ్రీవల్లభ స్వామి పిఠాపురంలో పుట్టి పెరగడం వల్ల ఆయన నడయాడిన ప్రదేశం కావడంతో ఈ ఆలయానికి శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానం అనే పేరు వచ్చింది.

పెరిగిన పర్యాటకం

గతంలో కేవలం పర్వ దినాల్లో మాత్రమే ఇక్కడకు మరాఠీ భక్తులు వచ్చేవారు. గత కొన్నేళ్ల నుంచి మామూలు రోజుల్లోనూ వస్తున్నారు. అప్పట్లో కేవలం ఏటా 4 నుంచి లక్షల వరకు భక్తులు రాగా గత కొన్నేళ్లుగా దీని సంఖ్య 20 లక్షల వరకు పెరిగింది. ఆలయంలో స్వామివారి దర్శనంతో పాటు భోజన, వసతి సదుపాయాలు అన్ని ఉచితంగా ఏర్పాటు చేయగా కేవలం కానుకల ద్వారానే ఏటా రూ.కోట్లలో ఆదాయం లభిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. మరాఠీ భక్తుల రాక పెరగడంతో పిఠాపురంలో ఒక్క సారిగా రవాణా, హోటల్స్, వసతి రంగాలకు పెద్ద ఎత్తున వ్యాపారం పెరిగింది.



స్వామివారి పూజల్లో పాల్గొన్న మరాఠీ భక్తులు



పిఠాపురంలో శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో యజ్ఞం నిర్వహిస్తున్న మరాఠీ భక్తులు

స్వామివారు మా ఇలవేల్పు



మా రాష్ట్రం నుంచి దత్తాత్రేయుని భక్తులు ఏడాదిలో ఒక్క రోజైనా ఇక్కడకు వారు ఉండరు. మా రాష్ట్ర ప్రజల్లో ఎక్కువ మందికి ఆయన ఇలవేల్పు. దేశంలో ఎక్కడ పడితే అక్కడ దత్తాత్రేయుని ఆలయాలు ఉన్నా ఆయన జన్మస్థలమైన పిఠాపురం మాకు మహా పుణ్యక్షేత్రం. ఏటా పిఠాపురం వచ్చి కనీసం మూడు రోజులైనా ఇక్కడ ఉండి స్వామివారి సేవ చేసుకుని వెళుతుంటాం. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా మా మరాఠీలకు పెద్ద నమ్మకం. మహారాష్ట్రలో ఎక్కువ మంది భక్తులు సంవత్సరానికి రెండు సార్లు ఇక్కడకు వచ్చి వెళతారు. – **హరి బాహూ నిట్టూర్కర్ జోషి,** శ్రీపాద వల్లభస్వామి భక్తుడు, సోలాపూర్, మహారాష్ట్ర

మరాఠీలకు పవిత్రమైన పుణ్యక్షేత్రం



మాకు అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రం ఇదే. కుటుంబ సభ్యులంతా కలిసి ఇక్కడకు వచ్చి స్వామివారిని దర్శించుకుంటాం. మా రాష్ట్రంలో దత్తాత్రేయుని దేవాలయాలు ఉన్నా ఆయన పుట్టి పెరిగిన పవిత్ర ప్రదేశం పిఠాపురంలో శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థనం అంటే మక్కువ ఎక్కువ. ఇక్కడకు వచ్చి స్వామిని దర్శించుకుంటే మాకు అంతా మంచి జరుగుతంది. ఏటా ఎన్నిసార్లు కుదిరితే అన్నిసార్లు వచ్చి స్వామిని దర్శించుకుని వెళుతుంటాం. మా రాష్ట్రం నుంచి ఎక్కువ మంది యాత్రికులు ఇక్కడకే వస్తుంటారు. దీనిని మించిన మహాక్షేత్రం మరొకటి లేదనేది మా నమ్మకం.

– **బీడీ వాని,** దత్తాత్రేయుని భక్తుడు, పింపల్‌నర్ జిల్లా, దూలే, మహారాష్ట్ర

భక్తులకు అన్ని వసతులూ కల్పిస్తున్నాం



ఈ ఆలయానికి వచ్చే భక్తుల్లో అధిక శాతం మరాఠీ భక్తులే. ఉత్సవాల సమయంలో వీరి సంఖ్య చాలా ఎక్కువగా ఉంటోంది. వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఉచితంగా ఏర్పాటు చేస్తున్నాం. వసతి సౌకర్యాలు మెరుగు పర్చడంతో తీర్థయాత్ర స్థలంగా మంచి గుర్తింపు వచ్చింది. వేలాది మంది వచ్చినా వారికి సౌకర్యాలు అందుబాటులో ఉండడం వల్ల భక్తుల సంఖ్య మరింత పెరుగుతోంది. వీరితో పాటు ఇతర దేశాల భక్తులు ఇక్కడకు వస్తున్నారు. ఇక్కడ గోసేవకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. తెలుగుతో పాటు మరాఠీ భాషలో దత్తపారాయణ గ్రంథాలు, ఇతర పుస్తకాలు ముద్రించి విక్రయిస్తున్నాం. మరాఠీ భక్తుల సౌకర్యార్థం ఆలయ విశేషాలు, ఇతర వివరాలు మరాఠీ భాషలో ఏర్పాటు చేశాం.

– **ఆర్.సౌజన్య,** ఈఓ, శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానం, పిఠాపురం

మరాఠీ భక్తులే ఎక్కువగా వస్తారు



స్థానికులు, ఇతర రాష్ట్రాల భక్తుల కంటే ఎక్కువ మంది మరాఠీ భక్తులే ఈ ఆలయానికి వస్తుంటారు. సాధారణ దర్శనంతో సరి పెట్టుకోకుండా కొన్ని రోజుల తరబడి ఇక్కడ ఉండి స్వామివారి సేవల్లో పాల్గొంటారు. దత్తాత్రేయ చరిత్రను పఠిస్తారు. యజ్ఞయాగాదుల్లోనూ పాల్గొంటారు. గంటల తరబడి ఆలయంలో ఉండి స్వామిసేవలో విలీనమై తన్మయం పొందుతుంటారు. మరాఠీలకు ఇలవేల్పు కావడంతో దత్తాత్రేయ భక్తులు కనీసం సంవత్సరంలో ఒక్క సారైనా ఇక్కడకు వచ్చి వెళుతుంటారు.

– **ద్విభాష్యం సుబ్రహ్మణ్యశర్మ,** ఆలయ అర్చకులు, శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థనం, పిఠాపురం

ఆత్మీయ కలయిక



గన్నవరం విమానాశ్రయంలో జగన్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన దొరబాబు

సామర్లకోట: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు శుక్రవారం కలిసారు. గన్నవరం ఎయిర్‌పోర్టులో జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ విషయాన్ని శుక్రవారం సాయంత్రం స్థానిక విలేకర్లకు దొరబాబు తెలిపారు.

నేడు జననేత జగన్ జన్మదిన వేడుక

సామర్లకోట: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకను శనివారం నిర్వహిస్తున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు పాగా సురేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు కేక్ కట్టింగ్, ప్రజలకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

క్లుప్తంగా

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ తల్లికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు బడ్జెట్ సమావేశం

సామర్లకోట: స్థానిక మండల ప్రజా పరిషత్ బడ్జెట్ సమావేశం శనివారం ఉదయం 11.30లకు ప్రారంభం అవుతుందని ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి తెలిపారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన జరిగే సమావేశానికి జెడ్పీటీసీ సభ్యురాలు, అన్ని గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీల సర్పంచ్‌లు హాజరు కావాలన్నారు.

అప్పారావు సేవలు మరువరానివి



అప్పారావు దంపతులను సత్కరించిన ఎంపీపీ, ఎంపీడీఓ

సామర్లకోట: ఆఫీసు సబార్డునేట్‌గా పదవీ విరమణ చేసిన వై.అప్పారావుకు శుక్రవారం ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు శుక్రవారం వీడ్కోలు సత్కారం చేశారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సత్తిబాబు మాట్లాడుతూ మూడు నెలల క్రితం జిల్లా పరిషత్తుకు బదిలీ అయినా, తమ కొరిక మేరకు ఇక్కడే విధులు నిర్వహించారని, సుమారు 15 ఏళ్లగా ఉత్తమ సేవలందించారన్నారు. ఎంపీడీఓ కె.హిమామహేశ్వరి మాట్లాడుతూ ఆయన పనితీరు కుటుంబ సభ్యులను బట్టి తెలుస్తుందన్నారు. ఈ సందర్భంగా అప్పారావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈఓ పీఆర్డీ భైరవమూర్తి, పరిపాలనాధికారి బి.సతీష్‌బాబు, జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన జగన్‌కే సాధ్యం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు
- మర్లావలో ఘనంగా జననేత జన్మదిన వేడుకలు

పెద్దాపురం: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండలం మర్లావ గ్రామంలో ఒకరోజు ముందుగానే వైభవంగా నిర్వహించారు. ఆయనపై ఉన్న అభిమానంతో మండల వైస్ ఎంపీపీ మిరియాల రాజా ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి 'పేదల పెన్నిధి, మాట తప్పని, మడప తిప్పని నాయకుడు ప్రజాకర్షక పథకాలు ప్రవేశపెట్టి ప్రజా సంక్షేమ పాలన సాగించిన జగన్ మోహన్‌రెడ్డి హ్యాపీ బర్త్‌డే టూ యూ' అంటూ భారీ కేక్‌ను కట్ చేసి అన్నదానం నిర్వహించారు. అభిమానుల కొలాహలం మధ్య కేక్ కట్ చేసిన అనంతరం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు మాట్లాడుతూ పేదల సంక్షేమం కోరుతూ పాలన సాగించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సేవాతత్పరత, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపైన ఉంటుందని దొరబాబు అన్నారు. అనంతరం టపాసులు పేల్చి, స్వీట్లు పంచి భారీ అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అయ్యరక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, సామర్లకోట మున్సిపాల్ వైస్ చైర్మన్ జాన్ మోజెస్, నాగబోయిన రాజుబాబు, సుందరెడ్డి రాజు, పెద్ది దొరబాబు, నానీ, కాత శంకరరావు, నడిగట్ల శ్రీను, మలపురెడ్డి లోవ అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న దొరబాబు

విఘాతం కలిగించిన వారిపై చర్యలేవి..?

- తాటిపర్తి నీటి సంఘం ఎన్నిక ఆపడం చట్ట విరుద్ధం
- నిందితులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి
- తాటిపర్తి నీటి సంఘం నామినేషన్ వేసిన సభ్యులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తి కోదండ రాముని చెరువు నీటి సంఘం ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని తాటిపర్తి నీటి సంఘానికి నామినేషన్ వేసిన సభ్యులు అధికారులను ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు, ఎన్నికల అధికారికి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా తాటిపర్తి నీటి సంఘం ఎన్నికల్లో నామినేషన్ వేసిన సభ్యులు అడబాల నాగేశ్వరరావు, సిరికోటి సత్యనారాయణ, దాసం అమలావతి, సామిబేడి బాబ్జి, గారపాటి గంగాధర్, అడపా భీముడు వివరాలు వెల్లడించారు. తాటిపర్తిలో సంఘం ఎన్నికలకు సంబంధించి ఈ నెల 14న నిర్దేశించిన సమయానికి తాము వెళ్లి నామినేషన్లు దాఖలు చేశామన్నారు. నామినేషన్ దాఖలుకు సమయం అయిపోవడంతో అధికారులు ఎన్నికల కేంద్రం గేటును మూసి వేశారన్నారు. సమయం మించి పోయాక కొందరు వ్యక్తులు ఎన్నికల కేంద్రం గేట్లు, కాపలా ఉన్న పోలీసులను తోసుకుంటూ ఎన్నికల కేంద్రంలోకి ప్రవేశించారన్నారు. సమయం మించిపోయిందని నామినేషన్లు తీసుకునే అవకాశం లేదని తెలిసి కూడా ఎన్నికల కేంద్రంలో గలాటా సృష్టించారన్నారు. కేకలు, అరుపులతో అధికారులు, ఇతర సభ్యులను భయభ్రాంతులకు గురిచేసేలా ప్రవర్తించారని తెలిపారు. దీంతో శాంతిభద్రతలకు విఘాతం కలిగినందున ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారన్నారు. కాగా ఎన్నికల నిబంధనలు తుంగలోకి తొక్కి శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారిపై ఇప్పటి వరకు ఏవిధమైన చర్యలు తీసుకోకుండా తిరిగి ఈ నెల 21న ఎన్నికలు నిర్వహించనున్నట్లు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. ఎన్నికలు నిలిచిపోవడానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోకుండా తిరిగి ఎన్నికలు నిర్వహించడం చూస్తుంటే వారికి అనుకూలంగా ఉన్నప్పుడు ఎన్నికలు పెట్టుకుంటున్నట్లు అర్థమవుతోందని ఆరోపించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని, వారిపై చర్యలు తీసుకోకుండా ఎన్నికలు నిర్వహిస్తే తాము ఎన్నికలను బహిష్కరిస్తామన్నారు. అధికారులు ఏకపక్షంగా వ్యవహరించి ఎన్నికలు జరిపితే తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించైనా న్యాయం పొందుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.



ఎన్నికల అధికారికి వినతిపత్రం అందజేస్తున్న తాటిపర్తి రైతులు

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాత



పిఠాపురం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు అప్పగించిన బాధ్యతను శిరసావహించి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా రెండోసారి నియమితులైన వర్ధినీడి సుజాత తెలిపారు. ఈ మేరకు ఆమె శుక్రవారం పిఠాపురంలో ఓ ప్రకటన విడుదల చేశారు. వెనుకబడిన వర్గాల మహిళలను ప్రోత్సహిస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని కొనియాడారు. తనపై నమ్మకం ఉంచి తనను రెండోసారి కాకినాడ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా నియమించడానికి కృషి చేసిన వైఎస్సార్ సీపీ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీతకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి ప్రణాళికలపై అవగాహన అవసరం

- ప్రజాప్రతినిధులు, కార్యదర్శుల శిక్షణలో ఎంపీడీఓ



సామర్లకోటలో శిక్షణ తరగతులలో మాట్లాడుతున్న అధికారులు

సామర్లకోట: గ్రామాల అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలు తయారు చేయడంపై సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు అవగాహన పెంచుకోవాలని ఎంపీడీఓ కె.హిమ మహేశ్వరి అన్నారు. మండల పరిధిలోని ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులకు, కంప్యూటర్ ఆపరేటర్లకు గ్రామాభివృద్ధి ప్రణాళికలపై ఒక రోజు శిక్షణను ఆమె ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు తయారు చేసే సమయంలో గ్రామసభలు నిర్వహించి గ్రామ పెద్దలు, మహిళా సంఘాల ప్రతినిధుల నుంచి గ్రామ అవసరాలను తెలుసుకోవాలన్నారు. ఆయా గ్రామాలలోని వ్యాపారులు, నిరుద్యోగులను గుర్తించి వారికి కావలసిన అవసరాలను గ్రామాభివృద్ధి ప్రణాళికల్లో పొందుపరచాలన్నారు. వ్యాపారులకు కావలసిన మార్కెట్ సదుపాయాలు, నిరుద్యోగులకు అవసరమైన సాంకేతిక శిక్షణ, ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలన్నారు. మహిళా సంఘాల సభ్యులకు కావలసిన బ్యాంకు రుణాలు అందజేసి వారు ఆ సొమ్మును వ్యాపారాలపై పెట్టుబడి పెట్టేలా చూడాలన్నారు. మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉంటుందని చెప్పారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని కార్యచరణలో అమలు చేయాలని సూచించారు. గ్రామాల మధ్య పోటీతత్వంతో అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ పీఆర్డీ భైరవమూర్తి, బి.సతీష్‌బాబు, జగన్నాథరావు పాల్గొన్ని శిక్షణ ఇచ్చారు.

తుపానులకు భీతిల్లుతున్న అన్నదాత

సామర్లకోట: మండల పరిధిలో సార్వా సీజన్‌లో 22,500 ఎకరాల్లో వరి సాగు చేయగా కోతల సమయం పూర్తయిన తరువాత కూడా వీకే రాయపురం రైతులకు తుపాను వల్ల ఎదురయ్యే సమస్యలు తప్పడం లేదు. బంగాళాఖాతంలో అల్పపీడనంతో పడుతున్న చినుకులకు వారు బెంబేలెత్తుతున్నారు. మండల, పట్టణ పరిధుల్లో ఇప్పటికే ధాన్యం ఒబ్బిడి చేసుకున్నారు. వరి కోత యంత్రాల ద్వారా ధాన్యం కోతలు పూర్తయ్యి ఆరబెట్టుకోవడానికి సిద్ధమైన తరుణంలో ప్రస్తుత తుపాను హెచ్చరికలు వారికి ఆటంకంగా మారాయి. ఇటీవల మరమ్మతులు పూర్తయిన కాజ్‌వే ద్వారా గత పది రోజులుగా రాకపోకలు ప్రారంభమయ్యాయి. తరచు వాతావరణ హెచ్చరికలతో రాయపురం రైతులు వ్యవసాయం అంటే భయపడుతున్నారు. ధాన్యం రాశులను కళ్లాల నుంచి రోడ్లపైకి తీసుకొని వచ్చి బరకాలతో కప్పుతున్నారు. భారీ వర్షం వస్తే ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉన్నదని రైతులు ఇంటి వెంకట్రావు, వెలమర్తి బుల్లిరాజు, శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా వీకే రాయపురం రైతులపై ప్రకృతి కక్ష కట్టిన్నట్లుగా ఉన్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వీకే రాయపురంలో బరకాలతో కప్పిన ధాన్యం రాశులు

సమస్యల పరిష్కారానికే సదస్సులు



కాపవరం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

సామర్లకోట: రైతుల భూ సమస్యల పరిష్కారించడానికి రెవెన్యూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర రెడ్డి అన్నారు. మండల పరిధిలో శుక్రవారం కాపవరం పంచాయతీలో నిర్వహించిన రెవెన్యూ సదస్సు కు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రైతుల దస్తావేజులోను, వారి స్వాధీనంలో ఉన్న భూమి మరొకరికి రికార్డు అయితే రీ సర్వేలో మార్పు చేసి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. భూములకు సంబంధించిన యథార్ధ పరిస్థితులపై ప్రతి రైతు సహకరించాల్సి ఉంటుందన్నారు. అవసరమైన సమయంలో నోటీసులు ఇచ్చి రైతులకు న్యాయం చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రతి రైతు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ రెవెన్యూ సదస్సులో 8 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంచం మాధవరావు రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీనివాసు, మండల సర్వేయర్ పి.సీతారామాచార్యులు, గ్రామ సర్వేయర్లు సృజనదేవి, దినేష్ మోషేరాజు, వీఆర్వోలు జి. నాగేశ్వరరావు, వై.ముసలయ్య, చంద్రబాబు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: గ్రామల్లోని సమస్యలను పరిష్కరించేదుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ చిన్నారావు తెలిపారు. మండలంలోని కుతుకుడుమిల్లి గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆరు అర్జీలు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదస్సులో అందిన ప్రతి ఫిర్యాదును విచారించి పరిష్కరిస్తామని తెలిపారు. శనివారం మూలపేటలో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి చిన్నారావు, ఎంపీటీపీ రాయుడు విష్ణు, డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కడలి కల్లోలం

- తీరంలో ఎగసిపడుతున్న అలలు
- కోతకు గురవుతున్న మత్స్యకార గృహాలు

కొత్తపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కడలి కల్లోలంగా మారింది. మండలంలోని తీరంలో కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. ఉప్పాడ, కోనపాపపేట తీరప్రాంతాల్లో ఉన్న మత్స్యకారుల ఇళ్లు కోతకు గురవుతున్నాయి. తీరంలోని మత్స్యకార గృహాల్లోకి నీరు చొచ్చుకు రావడంతో మత్స్యకారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఉప్పాడ తీర ప్రాంతానికి రక్షణగా వేసిన జియో ట్యూబ్ గోడ రాళ్లు సైతం పూర్తిగా సముద్ర గర్భంలో కలిసిపోయాయి. మత్స్యకార గృహాలతో పాటు ప్రభుత్వ భవనాలు, రోడ్లు, విద్యుత్ స్తంభాలు, పలు ఆలయాలు, వృక్షాలు సైతం సముద్ర గర్భంలోకి కలుస్తున్నాయి. రాత్రి సమయాల్లో సముద్రపు అలలు ఉధృతి మరింత పెరగడంతో తీరంలో మత్స్యకారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కాగా కోతకు గురవుతన్న ఉప్పాడ, కోనపాపపేల తీర ప్రాంతాలను శుక్రవారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. కోతకు గురవుతున్న తీరప్రాంతంలో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకున్నట్టు తహసీల్దార్ చిన్నారావు తెలిపారు.



కోనపాపపేటలో కోతకు గురవుతున్న గృహాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ చిన్నారావు



ఉప్పాడలో కోతకు గురవుతున్న గృహాలు

గోపాల్ బాబా ఆశ్రమంలో 23 నుంచి మహాచండీయాగం

పిఠాపురం: స్థానిక గోపాల్ బాబా ఆశ్రమ ప్రాంగణంలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో మహా రుద్రసహిత శత చండీ మహాయాగం నిర్వహించనున్నట్లు యజ్ఞ బ్రహ్మ వడ్లమాని సుబ్రహ్మణ్య శర్మ శుక్రవారం తెలిపారు. శ్రీసన్నిధి ధర్మ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 108 యజ్ఞ కుండలాలతో 126 మంది రుత్విక్కులతో యాగం నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలోని ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని మహా సంకల్పంతో నిర్వహించ తలపెట్టిన ఈ మహాక్రతువులో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు. యజ్ఞంలో ప్రత్యక్షంగా పాల్గొనేవారు నిర్వాహకులను సంప్రదించాలని ఆయన సూచించారు.



మహాయాగం నిర్వహణకు సిద్ధం చేస్తున్న యాగశాలలు

గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలకు శిక్షణ

కొత్తపల్లి: అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో రవికుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీల అభివృద్ధిపై సర్పంచులు, ఎంపీటీసీలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తొలుత మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. గ్రామాల్లో పేదరిక నిర్మూలన, ఆరోగ్యం, నాణ్యమైన విద్య, లింగ సమానత్వం, స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్, ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యరెడ్డి, ఏఓ చలమయ్య పాల్గొన్నారు.



కొత్తపల్లిలో శిక్షణకు హాజరైన సర్పంచులు, ఎంపీటీసీలు